

నూతన డిఎంహెచ్ఒగా మాలిని

శర్మిష్ఠ కృష్ణా జిల్లాకు బదిలీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా కృష్ణా జిల్లా గుడివాడ ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న డాక్టర్ ఆర్.మాలినిని ప్రభుత్వం నియమించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను శనివారం విడుదల చేసింది. ప్రస్తుతం ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పని చేస్తున్న ఎస్.శర్మిష్ఠను కృష్ణా జిల్లా డిఎంహెచ్ఒగా బదిలీ అయ్యారు. సోమవారం కొత్త డిఎంహెచ్ఒ మాలిని బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.



ఎస్.శర్మిష్ఠ

తిరుగుబాటు తుస్..!

జెడ్పి ఛైర్మన్‌పై పారని వైసిపి జెడ్పిటిసిల పాచిక

పద్మశ్రీపై అనర్హత వేటు కోసం ప్రత్యేక సమావేశం

మొత్తం 47 మంది జెడ్పిటిసిలకుగాను 38 మంది హాజరు

ఏదో నామకహ అన్నట్లు మాట్లాడి వదిలేసిన వైసిపి సభ్యులు

పార్టీ ఫిరాయింపుల చట్టం స్థానిక సంస్థలకు వర్తించదన్న సిఇఒ

గంటలోపే ముగిసిన ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీపై అనర్హత వేటు వేయాలని, అందుకోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని పట్టుబట్టిన వైసిపి జెడ్పిటిసిలు తీరా సమావేశంలో మాత్రం పెద్దగా మాట్లాడకుండానే ముగించేసిన పరిస్థితి నెలకొంది. అనర్హత వేటు చట్టప్రకారం సాధ్యం కాదని అధికారులు చెప్పడంతో గంటలోపే సమావేశం ముగిసిపోయింది. దీంతో దాదాపు రెండు నెలలుగా ఉత్కంఠ రేపుతున్న జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ అంశం ఎటువంటి హడావుడీ లేకుండా సద్దుమణిగింది. దీంతో వైసిపి సభ్యులు ప్రత్యేక సమావేశం కోసం ఎందుకు పట్టుబట్టారో.. సభ్యులంతా ఎందుకు మాట్లాడలేదో ఏ ఒక్కరికీ అర్థంకాని పరిస్థితి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 48 జెడ్పిటిసి స్థానాలు ఉన్నాయి. 2021లో జరిగిన జిల్లా పరిషత్ ఎన్నికల్లో వైసిపి 48కుగాను 46 చోట్ల గెలుపొందింది. రెండుచోట్ల జనసేన, టిడిపి గెలుపొందాయి. దీంతో జెడ్పి ఛైర్మన్‌గా వైసిపి నుంచి కవురు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆయన 2023లో స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేసి గెలవడంతో జెడ్పి ఛైర్మన్ పదవి ఖాళీ అయ్యింది. దీంతో వైసిపి పెదపాడు జెడ్పిటిసి గంటా పద్మశ్రీని ఛైర్‌పర్సన్‌గా వైసిపి ఎంపిక చేసింది. 2023 జూన్ ఎనిమిదో తేదీన పద్మశ్రీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఏడాది మే నెలలో జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలుపొందింది. దీంతో జెడ్పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ దంపతులు టిడిపిలో చేరిపోయారు. దీన్ని వైసిపి సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆమె జెడ్పిటిసి పదవిపై అనర్హత వేటు వేయాలని గడిచిన సెప్టెంబర్ ఎనిమిదో తేదీన జెడ్పి సిఇఒకు వినతిపత్రం ఇచ్చారు. అధికారులు స్పందించకపోవడంతో నవంబర్ ఎనిమిదిన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశాలను బహిష్కరించారు. దీంతో నవంబర్ 11న జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు జెడ్పి అధికారులు ప్రకటించారు. అయితే చివరి నిముషంలో ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో సమావేశం రద్దు చేసి, ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న జెడ్పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

ప్రత్యేక సమావేశం జరిగిందిలా..


వైసిపి జెడ్పిటిసిల డిమాండ్ మేరకు జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం ఈ నెల 21వ తేదీ ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేస్తున్నామని, మధ్యాహ్నం రెండు గంటల తర్వాత సర్వసభ్య సమావేశం జరుగుతుందని జెడ్పి సిఇఒ ప్రకటించారు. ఆ మేరకు శనివారం ఉదయం పది గంటలకు ప్రత్యేక సమావేశం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో 48 మంది జెడ్పిటిసి సభ్యులకుగాను యలమంచిలి ఖాళీ అయ్యింది. ఇంకా 47 మంది సభ్యులు ఉండగా ప్రత్యేక సమావేశానికి 38 మంది హాజరయ్యారు. వీరిలో ఇద్దరు టిడిపి, జనసేన, మిగిలిన 36 మంది వైసిపి సభ్యులే. తొలుత జెడ్పి ఇన్‌ఛార్జి సిఇఒ ఆర్.విజయరాజు మాట్లాడుతూ వైసిపి నుంచి గెలిచి టిడిపిలో చేరిన జెడ్పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీపై అనర్హత వేటు వేయాలంటూ ఇచ్చిన నోటీసుపై సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే అంశం ఎజెండాగా నిర్ణయించినట్లు తెలిపారు. తొలుత ఛైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు అనేక హామీలు ఇచ్చామని, ప్రజలకు మేలు చేయడానికి, అభివృద్ధి కోసమే పార్టీ మారానని చెప్పారు. అందరం కలిసిమెలిసి పని చేసి ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేరుద్దామన్నారు. వైసిపి పోడూరు జెడ్పిటిసి పెద్దిరాజు, పెదవేగి జెడ్పిటిసి విజయబాబు, పాలకొల్లు జెడ్పిటిసి గోవిందరాజు, మరో ఇద్దరు సభ్యులు మాట్లాడారు. వైసిపి గుర్తుపై గెలిచి పార్టీకి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ ద్రోహం చేశారన్నారు. వైసిపి సభ్యులంతా ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటే టిడిపిలో చేరారన్నారు. జెడ్పి ఛైర్‌పర్సన్‌పై అనర్హత వేటువేయాలని కోరారు. వీరవాసరం జెడ్పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు జెడ్పి ఛైర్‌పర్సన్‌కు అనుకూలంగా మాట్లాడారు. ఎంఎల్‌సి వంకా రవీంద్ర మాట్లాడుతూ ఒక పార్టీ నుంచి పదవి పొంది, వేరొక పార్టీలో చేరడం నైతికత కాదన్నారు. ఎక్కడున్నా పనులు చేయించుకోవచ్చునన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రతిపక్ష పార్టీలను గౌరవించే వ్యక్తులన్నారు. ఎవరు బలవంత పెట్టారో చెప్పాలన్నారు. ఇక సభ్యులు ఎవరూ మాట్లాడకపోవడంతో జెడ్పి సిఇఒ విజయరాజు మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఎంఎల్ఎ, ఎంపీలకు మాత్రమే వర్తిస్తుందని, స్థానిక సంస్థలకు వర్తించదని చెప్పారు. ఒక సభ్యుడు పదవి చేపట్టాక నాలుగేళ్ల వరకూ అవిశ్వాసం పెట్టడం సైతం కుదరదని స్పష్టం చేశారు. ఓటింగ్ పెట్టి తీర్మానం చేయాలని వైసిపి సభ్యులు అడగ్గా, అందుకు చట్టం అంగీకరించదని అన్నారు. మినిట్స్ నోట్ చేసి ఇవ్వాలని, ఆ వివరాలను పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు పంపిచాలని సభ్యులు కోరగా, ఆ విధంగా చేస్తామని చట్టప్రకారం ముందుకు సాగుతామని సిఇఒ తెలిపారు. దీంతో వైసిపి సభ్యులు ఎటువంటి ప్రతిఘటనా లేకుండానే మౌనంగా ఉండిపోయారు దీంతో గంటలోపే సమావేశం ముగిసింది. ఆఖరులో లీగల్‌గా ముందుకు సాగుతామని వైసిపి సభ్యులు తెలిపారు.

ప్రశాంతంగా ప్రాజెక్టు ఎన్నికలు


ఏకగ్రీవంగా ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు, చాట్రాయి

జిల్లాలో రెండు ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ఎన్నిక ఏకగ్రీవంగా, ప్రశాంతంగా జరిగినట్లు ఇరిగేషన్ ఎస్ఇ చిలకపాటి దేవప్రకాష్ తెలిపారు. శనివారం తమ్మిలేరు ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలు చాట్రాయిలోను, ఎర్రకాల్వ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలు జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. తమ్మిలేరు ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్‌గా యర్రా రమేష్, వైస్ ఛైర్మన్‌గా గుండా వెంకన్న, ఎర్రకాల్వ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్‌గా వందనపు అంజనాగ వెంకటరమణ, వైస్ ఛైర్మన్‌గా వాడపల్లి రాధాకృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని దేవప్రకాష్ తెలిపారు.



తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌గా ఎన్నికై ధ్రువీకరణపత్రాలు అందుకుంటున్న రమేష్, వెంకన్న



ఎర్రకాల్వ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైన వివిఎన్.వెంకటరమణ, వి.రాధాకృష్ణమూర్తి (కుడి నుంచి ఎడమకు)

చాట్రాయి: తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు కమిటీ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన ఎన్నికల ప్రక్రియలో పోలవరం గ్రామానికి చెందిన యర్రా రమేష్, ఎర్రంపల్లి గ్రామానికి చెందిన గుండా వెంకన్న ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా జె.భట్టువత్సలరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, చెలికాని కృష్ణారావు, వెలిది అప్పారావు ఎన్నికయ్యారు. డిఎల్‌పిఒ ఎంవిఎన్.నందరి ఎన్నికల అధికారిగా, సహాయక ఎన్నికల అధికారిగా ఎంపిడిఒ ఐ.విజయలక్ష్మి నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నేతలు మరిడి వెంకటేశ్వరరావు, మోరంపూడి శ్రీనివాసరావు, మందపాటి బసవారెడ్డి, పుచ్చకాయల నోబుల్‌రెడ్డి, అత్తులూరి శ్రీనివాసరావు, చాట్రాయి గ్రామ మాజీ సర్పంచి కోట జోషి, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వేమూరి విల్సన్‌రాజు, షేక్ నాగుల్‌మీరా, భాషా, చొదిమెళ్ల కృష్ణ, తిరువీధి బోసు పాల్గొన్నారు.



కామవరపుకోటలో నినదిస్తున్న నేతలు, ప్రజలు

చింతలపూడి: అమిత్‌షాపై వెంటనే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టి అరెస్టు చేయాలని చింతలపూడి మాలల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో కల్వకుర్తి నాగేశ్వరరావు, కాకర్ల సత్యం, ధార వీరేంద్ర, కంచర్ల బుచ్చిబాబు, గడివేసు ఏసు, లంకపల్లి భానుకుమార్, దొంతమాల అజయ్, బూసి ముత్తేశ్వరరావు, బోడ నాగయ్య, గొంది రాజు పాల్గొన్నారు.

కామవరపుకోట: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఆయనపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. శనివారం స్థానిక పాతూరులోని దళిత కాలనీలో అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. అమిత్‌షాచే మంత్రి పదవికి రాజీనామా చేయించాలని అని ప్రధాని మోడీని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

జెడ్పి సమావేశానికి కోరం కష్టాలు..!

సమావేశానికి 30 మంది వైసిపి సభ్యులు గైర్హాజరు

కోరం లేక గంటపాటు నిలిచిన సమావేశం

అతికష్టంపై 17 మంది సభ్యుల సంతకాలతో సమావేశం నిర్వహణ

సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎంఎల్ఎలు డుమ్మా

జిల్లాలోని విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కోరం కష్టాలు ఏర్పడ్డాయి. సమావేశం నిర్వహించాలంటే మొత్తం సభ్యుల్లో మూడో వంతు హాజరు కావాలి. ఆ తర్వాతే సమావేశం ముందుకు సాగించాలి. లేకపోతే సమావేశంలో తీసుకున్న నిర్ణయాలేవీ తీర్మానాలకు నోచుకోని పరిస్థితి. వైసిపి జెడ్పిటిసి సభ్యులు జెడ్పి ఛైర్‌పర్సన్‌పై గుర్రుగా ఉండటంతో ఉదయం ప్రత్యేక సమావేశానికి హాజరైననప్పటికీ మధ్యాహ్నం నుంచి జరిగిన సర్వసభ్య సమావేశాన్ని మాత్రం బాయ్‌కాట్ చేశారు. జిల్లా పరిషత్‌లో ప్రస్తుతం 47 మంది సభ్యులు ఉండగా 15 మంది ఉంటేనే సమావేశం నిర్వహణ సాధ్యం. రెండు గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా కోరం లేక మూడు గంటల వరకూ సమావేశం ప్రారంభం కాని పరిస్థితి. ఒకానొక దశలో సమావేశం రద్దవుతుందని అంతా భావించారు. ఎట్టకేలకు 17 మంది సభ్యులు సంతకాలు చేయడంతో గంట ఆలస్యంగా సమావేశం ప్రారంభమైంది. 30 మంది వైసిపి సభ్యులు సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. జెడ్పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ ముందుగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అన్ని హామీలనూ అమలు చేస్తుందన్నారు. జెడ్పి సభ్యులకు గ్రూప్ ఇన్సూరెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జెడ్పిటిసి, ఎంపిటిసిలకు గౌరవం వేతనం చాలాకాలంగా పెండింగులో ఉందని, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌ను కోరారు. పదోతరగతి పిల్లలకు గతేడాది మాదిరిగానే విజయకేతనం బుక్ అందిస్తామన్నారు. వ్యవసాయం, డ్వామా, విద్య, వైద్యం వంటి శాఖలపై సంబంధిత అధికారులు మాట్లాడారు. సభ్యులు లేకపోవడంతో ప్రజా సమస్యలపై పెద్దగా చర్చ లేకుండాపోయింది.

ఉమ్మడి పశ్చిమగోదావరిలో 15 మంది ఎంఎల్ఎలు ఉండగా నలుగురు మాత్రమే హాజరయ్యారు. 11 మంది డుమ్మాకొట్టారు. మంత్రులు, ఎంపీలు ఎవరూ రాలేదు. పత్సమట్ల ధర్మరాజు, బడేటి చంటి, బొలిశెట్టి శ్రీనివాస్, సొంగా రోషన్‌కుమార్, ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మాత్రమే హాజరయ్యారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు తెలియజేసిన సమస్యలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, చర్యలను సంబంధిత ప్రజాప్రతినిధులకు తెలపాలని ఆదేశించారు. ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పిటిసి ఒకరు మాట్లాడుతూ క్యాన్సర్ రోగులకు పింఛన్ అందించేవిధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

విద్యాశాఖలో సమస్యలను పరిష్కరించాలి..

బి.గోపీమూర్తి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి



నూతనంగా ఎన్నికైన ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి తొలిసారి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఆయన్ని అందరూ అభినందించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ తనను ఉపాధ్యాయులంతా రూపాయి ఖర్చు చేయకుండా అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. గత ప్రభుత్వం 117 జిఒ తీసుకురావడంతో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోయిందన్నారు. దీంతో అదనపు భారం, ఆన్‌లైన్ భారంసైతం పడిందన్నారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని కోరారు. కొవ్వూరులోని గవర్నమెంట్ కాలేజీలో సరైన సౌకర్యాలు లేవని, జెడ్పి గ్రాంట్ ఇవ్వాలని కోరారు. రైతులు కోతలు కోస్తూ వర్షాలకు ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా పరిషత్ నుంచి టార్పాలిన్లు అందిస్తే బాగుంటుందన్నారు. పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ ఇస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భారాలు తగ్గించేందుకు కంప్యూటర్ ఆపరేటర్లను నియమిస్తే బాగుంటుందన్నారు. మంత్రి లోకేష్‌ను ఇటీవల కలిసి ఆయా ప్రాంతాలకు అనువుగా పౌష్టికాహారం అందించాలని కోరినట్లు తెలిపారు. ఇక్కడ పులిహోర ఇస్తున్నారని, అది మార్పు చేయాలని సూచించారు.

యువత జాతీయ స్థాయిలో రాణించాలి

యువ ఉత్సవ్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల 27న నిర్వహించే జిల్లా యువ ఉత్సవ్‌లో యువత తమ ప్రతిభా పాటవాలను నిరూపించుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ, జిల్లా నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ ఉత్సవ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా స్థాయి యువ ఉత్సవాలలో యువత పాల్గొని ఆయా రంగాల్లో తమ ప్రతిభా పాటవాలను నిరూపించుకోవాలన్నారు. యువతలో దాగివున్న ప్రతిభను వెతికి తీసే లక్ష్యంతో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఆదిత్య డిగ్రీ కాలేజ్‌లో ఈనెల 27న యువ ఉత్సవ్ పేరుతో వివిధ పోటీ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ యువ ఉత్సవ్‌లో(ఇండియా 2047) అనే అంశంపై వకృత్వ, పెయింటింగ్, కవిత్వం, మొబైల్ ఫొటోగ్రఫీ విభాగాలలో వ్యక్తిగత పోటీలు, సాంస్కృతిక సాంప్రదాయ(గ్రూప్), జానపద(గ్రూప్), సైన్స్ ఎగ్జిబిషన్ మేళా పోటీలలో గ్రూప్, వ్యక్తిగత పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలో విజేతలను జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి పంపబడునని, గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయబడతాయన్నారు. జిల్లాలోని యువత ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని, యువ ఉత్సవ్‌లో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కలవరం.. కలకలం..!

అధికార పక్షంలో ఉన్న పూర్వపు వైసిపి నేతల తీరుతో టిడిపిలోనూ.. మరోసారి పోలవరం పర్యటన సందర్భంగా సిఎం చంద్రబాబు తీరుతో పోలవరం నిర్వాసితుల్లోనూ కలవరం నెలకొనగా.. రేవ్ పార్టీ, డెడ్‌బాడీ డోర్ డెలివరీ ఘటనలతో జిల్లాలో కలకలం నెలకొంది.

అధికార టిడిపికి వైసిపి నుంచి వచ్చిన నేతలతో కొత్త తలనొప్పులు పెరిగాయనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. నూజివీడులో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథి వైసిపి మాజీ మంత్రి జోగి రమేష్‌తో కలిసి పాల్గొనడంపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. దీనిపై ఇటు టిడిపి శ్రేణులతోపాటు అధినాయకులు చంద్రబాబు, లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. ముందస్తు సమాచారం లేక ఇలా జరిగిందని మంత్రి పార్థసారథి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇదే సమయంలో ఏలూరుకు చెందిన మాజీ మంత్రి ఆళ్ల నాని టిడిపిలో చేరేందుకు సిద్ధం కావడం, దీనిపై టిడిపి శ్రేణులు మండిపడడం అందరికీ తెలిసిందే. అయితే పోలవరం పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంఎల్ఎ బడేటి బుజ్జికి నానిని పార్టీలోకి తీసుకుంటున్నట్లు స్పష్టం చేయడంతో అంతా అవాక్కయ్యారు. దీనిపై టిడిపి శ్రేణులకు సర్దిచెప్పాల్సిన బాధ్యత ఎంఎల్ఎ చంటిపైనే పెట్టడంతో అనివార్యంగా ఆయనే మీడియా సమావేశం నిర్వహించి నాని చేరికను ప్రకటించాల్సి వచ్చింది. ఏదేమైనా ఈ రెండు ఘటనలు టిడిపిలో కలవరం సృష్టించాయనే చెప్పొచ్చు.

ఇక చంద్రబాబు మరోసారి గత సోమవారం పోలవరం పర్యటనకు విచ్చేశారు. పనులను పరిశీలించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2026 అక్టోబర్ నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని ఘంటాపథంగా చెప్పారు. దాని చుట్టూనే ఆయన మాటలు, సమీక్ష అంతా సాగాయి. ప్రాజెక్టు పనులు సరే.. ప్రాజెక్టు వల్ల నీట మునుగుతున్న నిర్వాసితులకు పరిహారం, పునరావాసంపై పెద్దగా చర్చించకపోవడం, స్పష్టత ఇవ్వకపోవడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. గతంలోనూ, గత ఎన్నికల ముందు కూటమి నేతలు నిర్వాసితులకు మేలైన పరిహారం ఇచ్చి పునరావాసం కల్పిస్తామని ఇచ్చిన హామీలేవీ చంద్రబాబు పర్యటనలో చర్చకు రాకపోవడంపై నిర్వాసితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క ప్రాజెక్టు పేరిట తమను నిలువునా ముంచుతూ కనీసం చట్టబద్ధంగా ఇవ్వాల్సిన పరిహారం, పునరావాసంపై నోరు మెదపకపోవడాన్ని తప్పుబడుతున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టు పనులతోపాటు పునరావాసం, పరిహారంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని నిర్వాసితులు కోరుతున్నారు.



ఇక ప్రశాంతతకు మారుపేరైన పశ్చిమగోదావరి జిల్లాలోనూ పాశ్చాత్య సంస్కృతి పోకడలు, నేర ప్రవృత్తి జడలు విప్పుతుందనడానికి ఇటీవల చోటుచేసుకున్న వరుస సంఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. నిడమర్రు మండలం క్రొవ్విడిలో జనసేన నేత పుట్టినరోజు వేడుకల సందర్భంగా అశ్లీల (నగ్న) నృత్యాల ప్రదర్శన ఏర్పాటు చేయడం కలకలం సృష్టించింది. ఆ వీడియోలు నాలుగు రోజుల తర్వాత వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. జనసేన అధినాయకత్వం వెంటనే స్పందించి ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. తర్వాత పోలీసులు సుమారు 22 మందిని అరెస్టు చేశారు. ఇంతవరకూ బాగానే ఉంది. గ్రామంలో జరిగిన జుగుప్సాకరమైన ఘటన వీడియో వైరల్ అయ్యే వరకూ పోలీసు అధికారుల దృష్టికి రాకపోవడం ఇంటెలిజెన్స్ వ్యవస్థ పని తీరులో వైఫల్యానికి నిదర్శనంగా ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో డ్రగ్స్ ఆనవాళ్లు లభ్యమయ్యాయి. ఇక గంజాయికి అయితే అంతే లేదు. పరిస్థితి రోజురోజుకీ దిగజారుతున్న తరుణంలో ఈ ఘటన పోలీసు వ్యవస్థకు మచ్చ తెచ్చేలా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇక ఉండి మండలం యండగండిలో డెడ్‌బాడీ డోర్ డెలివరీ తీవ్ర కలకలం సృష్టించింది. ఎలక్ట్రికల్ సామాన్లు పేరిట పంపిన పార్శిల్‌లో పురుషుని మృతదేహం ఉండటం ఆ పార్శిల్ అందుకున్న కుటుంబంతోపాటు ఆ గ్రామస్తులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారెవరూ అనే దానితోపాటు ఆ మృతదేహం ఎవరిదా అని అంతా తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. మృతుడు ఎవరూ, ఎందుకు హత్య చేశారు, పార్శిల్ రూపంలో ఎందుకు పంపారు వంటి పలు ప్రశ్నలకు సమాధానాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఏదేమైనా ఒక నిండు ప్రాణాన్ని బలిగొనడంతోపాటు ఆ మృతదేహాన్ని డోర్ డెలివరీ చేయడంపై మానవత్వ విలువలు ఏ స్థాయిలో దిగజారిపోయాయనే దానికి నిదర్శనమని పలువురు నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. ఒకే దేశం, ఒకే భాష, ఒకే ఎన్నిక అని, స్వదేశీ అంటూ గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు మరి పాశ్చాత్య సంస్కృతి అడ్డుకట్టకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కాని ప్రశ్నగా ఉందని పలువురు పెదవి విరుస్తున్నారు. ఏదేమైనా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

స్టడీ మెటీరియల్ విద్యార్థులు ఉపయోగించుకోవాలి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ఎంఎల్‌సి


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పదవ తరగతి విద్యార్థుల కోసం యుటిఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను శనివారం స్థానిక ఎఆర్‌డిజికె నగరపాలక ఉన్నత పాఠశాలలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి మాట్లాడుతూ పదవ తరగతి స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, గత కొన్ని సంవత్సరాలుగా ఈ పుస్తకం నుంచే 70 శాతం ప్రశ్నలు వస్తున్నందున ఈ స్టడీ మెటీరియల్ ప్రతి విద్యార్థి ఉపయోగించుకోవాలని సూచించారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో బహిరంగ మద్దతు ప్రకటించి, అఖండ మెజారిటీతో గెలిపించినందుకు పాఠశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.ముస్తఫా అలీ, ఆర్.రవికుమార్, జిల్లా కోశాధికారి రంగామోహన్, కార్యదర్శి ఈడే.శివశంకర్ పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ముసునూరు

విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చింతలవల్లి గ్రామంలో ప్రధాన కూడలి సెంటర్ వద్ద పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్‌ను రద్దు చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, పిల్లి మురళీ, దాసు, రంగారావు, సత్యనారాయణ, వెంకన్న పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

గ్రామాలాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

జనరల్‌బాడీలో ఎంపిపి

ప్రజాశక్తి - ఉంగుటూరు

గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులతో అధికారులు సమన్వయంగా వ్యవహరిస్తూ భాగస్వాములు కావాలని ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి అన్నారు. ఆమె అధ్యక్షతన శనివారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో పలు సమస్యలపై సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. దొంతవరంలో తాగునీటి ఫిల్టర్ బెడ్ రిపేర్‌కి నిధులు మంజూరు చేయాలని సర్పంచి కంభంపాటి సత్యవతి కోరారు. అక్కుపల్లి గోకవరంలో ఇల్లు నిర్మించుకున్న వారికి కొంతమందికి బిల్లులు పెండింగ్లో ఉన్నాయని సర్పంచి మిద్దె సత్యవతి కోరగా సచివాలయంలో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయించాలని హౌసింగ్ ఎఇ సతీష్ సూచించారు. అనంతరం పంచాయతీరాజ్ ఎఇ కృష్ణమోహన్ మాట్లాడుతూ మండలంలో 5 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.4.90 కోట్ల నిధులు మంజూరు అవ్వగా, వాటితో పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. పల్లె పండగకు రోడ్లను పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం పంచాయతీ ఆఫీస్, సచివాలయం, పొలం గట్ల మీద కాకుండా వేరే చోట ఎందుకు నిర్వహించారని కాగుపాడు సర్పంచి కడియాల సుధేష్ణ ప్రశ్నించారు. రైతు భరోసా కేంద్రాన్ని రైతు సేవా కేంద్రంగా మారుస్తూ వచ్చిన ఉత్తర్వులను పంచాయతీ సర్పంచి ఇవ్వరా అని పలువురు సర్పంచులు సభను కోరగా సంబంధిత ఉత్తర్వులు కాపీలను సర్పంచ్లకు అందజేస్తామని వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గంజి రాజ్‌కుమార్, వైస్ ఎంపిపి సింగినీడి సూర్యనారాయణ, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

పలుచోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని ముసునూరు, చింతలవల్లి, కొర్లకుంట, వేలుపు చర్ల, కాట్రినిపాడు, గోపవరం ఇలా పలు గ్రామాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాటలు, డాన్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ బెనర్జీ, కె.రాంబాబు, కె.ప్రవీణ్, ఉపదేశకులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని నెహ్రూ కాలనీలో టిడిపి నాయకులు బి.ఇళయరాజా, బి,రమేష్, బి.ప్రసన్నకుమార్ సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రాండ్ సెమీ క్రిస్మస్‌కు ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కొలుసు పార్థసారథి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా క్రిస్టియన్ సోదరుల అభివృద్ధి, సంక్షేమానికి రూ.150 కోట్లు కేటాయించిన కూటమి ప్రభుత్వం క్రిస్టియన్ సంక్షేమానికి, వారి అభివృద్ధికి, జెరుసలేము యాత్రకు, విదేశీ విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించిందని, దాన్ని క్రిస్టియన్ సోదరులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దానికి కావలసిన సహకారం అందిస్తామని మంత్రి తెలిపారు. కూటమి నాయకులు, చర్చి పాదర్లు సిస్టర్స్, పెద్దలు ఇళయరాజా పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : సిఐ

చింతలపూడి : విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి రావాలని విజయవాడ సిఐ సుధాకర్ ఆకాంక్షించారు. మండలంలోని ముసునూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సిఐ సుధాకర్, మానేపల్లి బ్రదర్స్ ప్లేట్స్, గ్లాసులు వితరణ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కష్టపడి చదివి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి రావాలని ఆకాంక్షించారు. టిడిపి నాయకులు మానేపల్లి రాజారావు మాట్లాడుతూ కష్టపడి చదువుతూ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అన్నదమ్ముల్లా కలసిమెలసి ఉండాలని, ఒకరికొకరు సహాయం చేసుకోవాలన్నారు. ఏది అవసరమో సహాయం చేస్తామని ఎల్లవేళలా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

'నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి'

చింతలపూడి : క్యాడెట్లు అందరూ సమాజ సేవ, దేశ రక్షణ, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, సమాజంలో మంచి లక్షణాలు కలిగిన పౌరులుగా జీవించాలని 19వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండే అన్నారు. స్థానిక చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. ఎన్‌సిసికి చెందిన అన్ని రకాల రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడి ఎన్‌సిసి వింగ్ పనితీరును అభినందనలు తెలియజేశారు.

హైదరాబాద్‌కు నూతన హైటెక్ బస్సు సర్వీసులు

పోలవరం : పోలవరం నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగించేందుకు శనివారం అంజనా ట్రావెల్స్ పేరిట హైటెక్ బస్సు సర్వీసులు ప్రారంభించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో పోలవరం నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి పోలవరం ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు బస్సుల సీట్లు సరిపోకపోవడం, సర్వీసులు రోజుకి రెండు మాత్రమే ఉండడం, ఇతర ప్రాంతాలకు వెళ్లి బస్సు ప్రయాణం చేయవలసి రావడం, అదనపు ఛార్జీలు వెచ్చించాల్సి వస్తుండడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నూతనంగా బస్సు సర్వీసులు ప్రారంభించినట్లు అన్నారు. సాయంత్రం 6:45కు పోలవరం నుంచి బస్సు బయలుదేరుతుందని నిర్వాహకులు తెలిపారు.

స్త్రీల పట్ల వివక్ష తగదు

ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ గిరిబాబు

ఏలూరు అర్బన్ : అన్ని రంగాల్లోనూ పురుషులతో పాటు సమానంగా రాణిస్తున్న స్త్రీలను తక్కువ చేసి చూడడం తగదని, మహిళలపై గృహ హింస అనాగరికమని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నవంబర్ 25 నుంచి డిసెంబర్ 23 వరకు నిర్వహిస్తున్న నేషనల్ జెండర్ కాంపెయిన్-చేతనా-3.0లో భాగంగా శనివారం గృహహింస వ్యతిరేకతపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ స్త్రీలపై వివక్షత సామాజిక రుగ్మతగా వర్ణించారు. అనేక రకాలుగా స్త్రీలపై జరుగుతున్న ఈ హింసను నిరసిస్తూ అలాంటి సంఘటనలు జరిగినప్పుడు తెలియజేయాల్సిన టోల్ ఫ్రీ నెంబర్స్‌ను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం కార్యక్రమాన్ని సమన్వయం చేసిన వృక్ష శాస్త్ర అధ్యాపకులు టివిఎస్.పద్మావతి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాంబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకట్రావు, ఎస్.పరమేశ్, డి.వెంకట దుర్గాప్రసాద్, ఎస్.సున్నంత, డి.సుజాత పాల్గొన్నారు.

గోనె సంచుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఆగిరిపల్లి : ధాన్యం సేకరణలో రైతులకు అందించే గోనె సంచుల పట్ల నాణ్యతా ప్రమాణాలు పాటించటంతో పాటు ధాన్యం సేకరణ, కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రైస్ మిల్లర్లు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పనిచేయాలని నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్ ఆదేశించారు. శనివారం ఆయన ఆగిరిపల్లిలోని మణికంఠ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి గోనెసంచుల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పివిఎస్.ప్రసాద్, వ్యవసాయాధికారి పి.చెన్నైశ్వరరావు, రైస్‌మిల్లు యజమాని వి.శ్రీనివాసరావు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయమూర్తుల నైపుణ్యం పెంపునకు శిక్షణ

ఏలూరు అర్బన్ : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తులకు ఒక రోజు శిక్షణా తరగతులను శనివారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలపై న్యాయమూర్తులు మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఈ శిక్షణా తరగతులు ఉపయోగపడతాయన్నారు. ఇందు ఫ్రేమింగ్ ఆఫ్ చార్జెస్, సెక్షన్ 311, 313, 319 సిఆర్ పిసి, బాధితులు-పరిహారము మొదలైన చట్టాలపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్‌గా ఎపి అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ హైదరాబాద్ వైస్ ఛైర్మన్(రిటైర్డ్) వైవి.రామకృష్ణ, రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి జివి.కృష్ణయ్య, హై కోర్ట్ ఆఫ్ తెలంగాణ అడ్వకేట్ సురేష్, ఎనిమిదవ అదనపు సునీల్ కుమార్ వ్యవహరించారు. ఉమ్మడి జిల్లా న్యాయమూర్తులు పాల్గొన్నారు.

తగ్గిన తుపాను ప్రభావం

పోలవరం : మండలంలో తుపాను ప్రభావం తగ్గి వాతావరణం సాధారణంగా మారడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం మండలంలో పోలవరం నుంచి తాడిపూడి వరకూ రహదారికి ఇరువైపులా ఖాళీ ప్రదేశాలలో రైతులు తమ ధాన్యాన్ని ఎండకు ఆరబెట్టే పనిలో పడ్డారు. దీనికి తోడు పగలు ఉష్ణోగ్రతలు రైతులకు అనుకూలంగా మారడంతో తేమశాతం తగ్గి అమ్మకాలకు ధాన్యం సిద్ధమయ్యింది. కొంతమంది రైతులు ధాన్యం ఆరబెట్టిన ప్రాంతం నుంచే దళారులకు అమ్మకాలు చేస్తున్నారు.

ఆడబిడ్డలకు న్యాయం చేయాలి

బాధితులకు అండగా నిలిచిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

తమకు వారసత్వంగా సంక్రమించిన తమ భూమిని తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ గత వారం రోజులుగా మండల పరిధిలోని సీతారామ నగరంలో న్యాయం కోసం నిరసన చేస్తున్న ఆడబిడ్డలకు న్యాయం జరిగే వరకూ సిపిఎం అండగా ఉంటుందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి నాగేంద్రరావు అన్నారు. గత వారం రోజులుగా మారుమూల గ్రామమైన సీతారామ నగరంలోని ఊరు చివర తమ జామాయిల్ పొలంలో మర్రెడ్డి అన్వేషిని, చిగురుపాటి అపర్ణ, దండ అనూష, ఏలూరి ప్రశాంత్, ఏలూరు రాంప్రసాద్‌లు చంటి బిడ్డలతో కలిసి నిరసన చేస్తున్న ప్రాంతానికి శనివారం సిపిఎం మండల కమిటీ వెళ్లి వారి నుంచి పూర్తి వివరాలు అడిగి తెలుసుకుని అండగా నిలిచారు. ఈ సందర్భంగా బాధితురాలు చిగురుపాటి అపర్ణ మాట్లాడుతూ తాతల తండ్రుల నుంచి తమకు వారసత్వంగా వచ్చిన 62 ఎకరాల



న్యాయం కోసం నిరసన చేస్తున్న ఆడబిడ్డలకు అండగా నిలిచిన సిపిఎం మండల కమిటీ

భూమిని తమకు ఇవ్వకుండా మా పెద్దనాన్న, మా బాబాయిలు అక్రమంగా సాగు చేసుకుంటూ అడిగిన మమ్మల్ని చంపుతామని బెదిరిస్తున్నారన్నారు. తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమ వాటాకు వచ్చిన భూమిలోని జామాయిల్ పంటను అక్రమంగా నరికి అమ్ముకుంటున్నారని, దీంతో మేమంతా కలిసి జామాయిల్ తోటలో గత వారం రోజులుగా న్యాయపోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ గత వారం రోజులుగా రాత్రి, పగలు తేడా లేకుండా, ఆడబిడ్డలు తమ చంటి పిల్లలతో తినడానికి తిండి లేకుండా, కంటి నిండా నిద్ర లేకుండా అడవిలోని తమ పొలంలో న్యాయం కోసం నిరసన చేస్తున్నా సంబంధిత వ్యక్తులు కానీ సంబంధిత అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే న్యాయమైన సమస్యను పరిష్కరించి ఆడబిడ్డలకు రావాల్సిన భూమిని వారికి ఇవ్వాలని, లేనిపక్షంలో మండల మహిళా సంఘాలను ఏకం చేసి వారికి న్యాయం జరిగే వరకూ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బుయ్యన శ్రీను, మండల నాయకులు పట్ల లక్ష్మయ్య, వలి పాషా పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి


ప్రజాశక్తి - ముసునూరు

తమ గ్రామంలో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించే విధంగా ఈ గ్రామ సభ ఉపయోగపడుతుందని రెవెన్యూ తహశీల్దార్ పిజి.శర్మ పేర్కొన్నారు. శనివారం మండలంలోని రమణక్కపేట గ్రామ సచివాలయంలో రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 48 మంది రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు రవికాంత్, మస్తాన్ రావు, హరిబాబు, నవీన్ బాబు, హనీ బాబు, విజయ కుమారి, యశోద, ఎస్.శ్రీనివాసరావు, టిడిపి నాయకులు రంగు శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

చింతలపూడి : గ్రామాలలో ఏమైనా రెవెన్యూ సమస్యలు ఉంటే, గ్రామాలలో జరిగే రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారం పొందవచ్చు అని చింతలపూడి తహశీల్దార్ ప్రమద్వర అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో చాలామంది రైతులు మరణించిన తల్లిదండ్రుల పేరున భూములు ఉన్నాయని, సదరు భూములను వారసులైనవారు పట్టా జిరాక్స్ వాటాలు జోడితో కుటుంబ సభ్యుల ధృవపత్రం జతపరిచి సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయబడతాయని తహశీల్దార్ తెలిపారుఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి చెవూరి సాయి కుమారి, కూటమి నాయకులు ఉపేంద్ర పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: మండల పరిధిలోని పోతవరప్పాడు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సత్తు కోటేశ్వరరావు పేదలకు ఇళ్ల స్థలాలు, పోరంబోకు, అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు పంచాలని అర్జీని రీ సర్వే డిటి మరియన్నకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల కోటేశ్వరరావు, కంభంపాటి ప్రకాశ్, రాజులు పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : మండలంలోని నార్లవరం పంచాయతీ, కొత్తూరు గ్రామ రెవెన్యూ సదస్సులో స్థానిక తహశీల్దార్‌కి వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రాష్ట్రానికి జీవనాడైనా పోలవరం ప్రాజెక్టులో



ముదినేపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కామినేని శ్రీనివాస్

మాకు ఉన్నటువంటి భూములు కోల్పోయాం, ప్రభుత్వం భూసేకరణ విషయంలో తప్పుడు కాంటూరు లెక్కల తోటి ప్రభుత్వం వారికి అవసరమైనంత మేరకే సేకరించి, మిగతా భూములను వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 2022వ సంవత్సరంలో వచ్చిన గోదావరి వరదల్లో కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా మిగిలిన భూములు మునిగాయని తెలిపారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నటువంటి, పట్టా, పోడు ఇతర భూములకు ఎటువంటి పరిహారం ఇవ్వకుండా, ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు గాని, సబ్సిడీలు ఇవ్వకుండా విస్మరించడం తగదని పేర్కొన్నారు. మిగులు భూముల విషయంలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిగులు భూములను, పోడు భూములు సర్వే చేసి పునరావాస కాలనీలు చూపెట్టిన చోట భూమికి భూమి లేదా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్ముల రమేష్, మడివి దుర్గారావు, కట్టం ముత్యాలరావు, సర్పంచి రంగమ్మ, కుంజా సత్తిబాబు, పూనెం రామారావు, రాజులు పాల్గొన్నారు.


ముదినేపల్లి : భూ సమస్యలను పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన ముదినేపల్లి సచివాలయం వద్ద శనివారం జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో భూ రీసర్వే పేరిట అనేక సమస్యలు తలెత్తడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు రైతుల వద్దకే వస్తున్నారని, రైతులు తమ సమస్యలను అధికారులకు వివరించి, భూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి రైతు మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న గ్రామ రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కో కన్వీనర్ కొడాలి వినోద్, ఎర్నేని కిషోర్ బాబు, కోడూరు శేషబాబు, గ్రామ సర్పంచి నిమ్మ గడ్డ కైకమ్మ, ముదినేపల్లి డిసి ఉపాధ్యక్షులు హనుమార పేర్నీడు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు పాల్గొన్నారు.

టి.నరసాపురం: రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ తెలిపారు. తిరుమల దేవి పేట గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భూ సమస్యలు స్థానికంగా పరిష్కరించడం కోసం గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తహశీల్దార్ సాయి బాబా, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ స్రవంతి పాల్గొన్నారు.

కామవరపుకోట: కామవరపుకోటలోని పాతూరులో సుమారు 45, 50 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న 63 మంది దళితులకు సంబంధించిన ఇళ్లకు పట్టా ఇవ్వాలివ్వాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ జి.ఎలీషాకి అర్జీ అందజేశారు. కామవరపుకోట గ్రామ రెవెన్యూ పరిధిలో గత 80 సంవత్సరాలుగా సాగులో ఉన్న దళితుల భూములకి పట్టాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు, ఎం.నాగార్జున, ఎం.వీరయ్య, ఎం.స్వామి, ఎం.వెంకయ్యమ్మ పాల్గొన్నారు.

టిడిపి మాజీ వార్డు మెంబర్ వెంకటేశ్వరరావు మృతి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల




టిడిపి ద్వారకాతిరుమల మాజీ పంచాయతీ బోర్డు మెంబర్ రేవు వెంకటేశ్వరరావు గుండెపోటుతో శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో హఠాన్మరణం చెందారు. టిడిపి కార్యకర్తగా, బోర్డు మెంబర్‌గా ఎన్నో కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన అంత్యక్రియలు శనివారం రాత్రి 7 గంటల సమయంలో కుటుంబ సభ్యులు నిర్వహించారు. ద్వారకాతిరుమల శ్మశాన వాటికలో కనీసం కరెంట్ పోల్ కాని, కరెంట్ లైట్ కాని లేని పరిస్థితి నెలకొంది. ద్వారకా చెరువు గ్రామ ప్రజలు అంత్యక్రియలు నిర్వహించుటకు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఆటో లైటింగ్ సహాయంతో నిర్వహించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పరిస్థితిని అర్థం చేసుకుని, ద్వారకాతిరుమల శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని గ్రామ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పేదలకు చీరల వితరణ అభినందనీయం

గ్రామ ప్రముఖులు ముల్లంగి శోభనాద్రి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



చీరలు అందుకున్న పేద మహిళలతో తబితా నిర్మలా జ్యోతి

పేదలకు కల్వరి ప్రేయర్ టవర్ ద్వారా చీరలను వితరణగా అందజేయడం ఎంతో అభినందనీయమని మల్లిబోయినపల్లి గ్రామ ప్రముఖులు ముల్లంగి శోభనాద్రి అన్నారు. శనివారం మండల పరిధిలోని మల్లిబోయినపల్లి గ్రామంలో కల్వరి ప్రేయర్ టవర్ వారి వితరణతో ఆ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ జె.తబితా నిర్మలా జ్యోతి చేతుల మీదుగా 60 మంది పేద మహిళకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు జి.రూతు, పలువురు గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన ప్రధానోపాధ్యాయుల శిక్షణ


ఆగిరిపల్లి : పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్యామ్ సుందరరావు అన్నారు. గత వారం రోజులుగా మండల పరిధిలోని హీల్ పాఠశాలల్లో ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలు అభివృద్ధిపై నిర్వహించిన శిక్షణా తరగతులు శనివారంతో ముగిసిన సందర్భంగా హీల్ పాఠశాల సిఇఒ కూరపాటి అజయ్‌కుమార్‌కు రూ.2,12,813 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పలుచోట్ల జగన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి 52వ పుట్టినరోజు వేడుకలను ఆగిరిపల్లి బస్టాండ్ సెంటర్ వద్ద వైసిపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, నాయకులు ఎం.హరిబాబు, పి.నరశింహారావు, సిహెచ్.శ్రీనివాసరావు, ఎస్.గోపీనాథ్, టి.పావనజ్యోతి, సృజనకుమారి, జెసిఎస్ మండల కన్వీనర్ ఎన్.భాస్కరప్రసాద్, ఎన్.కాంచనరావు, కె.ప్రదీప్, సుభానీ, వేము రాజు పాల్గొన్నారు.

ఉంగుటూరు : మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం ఉంగుటూరు మండలంలో వైసిపి నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. చేబ్రోలు జగనన్న కాలనీలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద కాలనీ ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సొసైటీ మాజీ అధ్యక్షులు పాపారావు బాబ్జి, ఎంపిటిసి సభ్యులు రాయి లక్ష్మి, మనసాల నాగమణి, గ్రామ అధ్యక్షులు ముత్తా బుజ్జి, మాజీ సర్పంచి కర్ణ బుజ్జి పాల్గొన్నారు.



ఉంగుటూరులో..


కుక్కునూరులో..

నారాయణపురంలో : వైసిపి మండల కన్వీనర్ మరణ మంగారావు ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఎంపిటిసి సభ్యులు బండారు నాగరాజు, అరివెల్లి మహాలక్ష్మి పాల్గొన్నారు.

ముసునూరు : పేద, బడుగు, బలహీన వర్గాల వారికి నెల నెల ఆర్థిక సహాయం అందజేస్తూ అందరి గుండెల్లో నిలిచిపోయిన మనసున్న వ్యక్తి, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని మండల వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. శనివారం మండలంలోని 16 గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటగిరి రాజానాయనా, బి.నరసింహారావు, జలగం శేషగిరిరావు, కె.రాంబాబు, చిలుకూరి భాస్కరరావు, శ్రీనివాసరావు, దేవేంద్ర, రేగుల నరసింహారావు, రేగుల గోపాలకృష్ణ, రేగుల లోకేశ్వరరావు, పిల్లి సత్యనారాయణ, గుంటూరు రంగారావు, నగుళ్ల రాంబాబు పాల్గొన్నారు.

కుక్కునూరు : వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 52వ జన్మదిన వేడుకలను కుక్కునూరు ప్రధాన కూడలి, సంజయ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. స్కూల్లో ఉన్న చిన్నపిల్లలకు మిఠాయిలు పంచి అనంతరం కుక్కునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పోలవరంలో..

పోలవరం : మండలంలో మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. అనంతరం మహాత్మాగాంధీ వృద్ధాశ్రమంలో గూటాల ఉపసర్పంచి కరిబండి శ్రీను ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, సర్పంచి పొడుం పుష్ప, ఉప సర్పంచి కోరశిక శ్రీనివాస్, పొడుం శ్యాం కుమార్ పాల్గొన్నారు.

చాట్రాయి : జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు మండలంలోని అన్ని గ్రామాలలో ఘనంగా శనివారం నిర్వహించారు. చాట్రాయిలోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు స్వీట్స్ పంచారు. రాష్ట్ర సహకార కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షులు పుచ్చకాయల సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు పరస చెన్నారావు, సంకు సత్యనారాయణ, నెల్లూరి రాజేష్, వనమా వాసు పాల్గొన్నారు.

చింతలపూడి: మండలంలోని ఫైర్ స్టేషన్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫైర్ స్టేషన్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. చింతలపూడి ప్రభుత్వ హాస్పిటల్ వద్ద రోగులకు ఫ్రూట్స్, బ్రెడ్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు, మిర్యాల దిలీప్, సిటీ మెడికల్ దుర్గారావు పాల్గొన్నారు.

టి.నరసాపురం: మర్రిగూడెం గ్రామములో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు వైసిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురసం నిరీక్షణ రావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. టి.నరసాపురం వైసిపి ఎస్‌టి సెల్ అధ్యక్షులు కురసం రవీంద్రబాబు, యూత్ నాయకులు పూసం సూర్యచంద్రరావు, పూనెం రాజశేఖర్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : జగన్ పుట్టినరోజు సందర్భంగా శనివారం వైసిపి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోమటి విష్ణువర్ధన్, మండల అధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, బత్తిన కిశోర్, ఈడే వెంకటేశ్వరావు, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సత్కారం

ప్రజాశక్తి - దెందులూరు

ఇటీవల సాంఘిక శాస్త్రంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సాధించిన దారపురెడ్డి భాస్కరరావును స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, శ్రీదేవి దంపతులను అప్పన్న వీడు జెయంజె జూనియర్ కళాశాలలో శనివారం ఘనంగా సత్కరించారు. తల్లిదండ్రుల వెయిటింగ్ హాల్ ప్రారంభోత్సవ సందర్భంగా రేమల్లె సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు దారపురెడ్డి భాస్కర్ రావుని గన్నవరం ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు, గన్నవరం ఎంఎల్ఎ దాసరి వెంకట బాలవర్ధన్ రావుల చేతుల మీదుగా సత్కరించారు. వేలేరు బాపులపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కొమ్మ విజయ్, టివి నాగేశ్వరరావులు, అరుణా చారిటబుల్ ట్రస్ట్ అధినేత చలమలశెట్టి రమేష్ బాబు, ప్రముఖ కార్డియాలజిస్ట్ వీరమాచినేని స్వరాజ్యం, చక్రధర్ దంపతులు, భాస్కర్ రావు సేవలను కొనియాడారు. ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణం జరగాలంటే భాస్కర రావు మాస్టర్ లాంటి మంచి ఉపాధ్యాయుల బోధన ద్వారానే సాధ్యం అని, ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. తల్లిదండ్రులకు వీరమాచినేని సత్యప్రసాద్ అనేక సూచనలు చేశారు. స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్, రవి, కార్యక్రమ వ్యాఖ్యాతగా గొల్లనపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కెవిఎస్.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

పాడిరైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన

నూజివీడు టౌన్ : తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి చేసుకోవడానికి పాడి రైతులు పాటించవలసిన యాజమాన్యం పద్ధతులను కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ శ్రీ చలసాని ఆంజనేయులు వివరించారు. శనివారం గన్నవరం క్లస్టర్ పరిధిలోని రావిచర్ల, బోర్వంచ గ్రామ సొసైటీలను ఆయన సందర్శించి సంఘ అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, పాడి రైతులతో సమావేశమై మాట్లాడారు. భారత దేశంలో అత్యధిక పాల సేకరణ ధరను ఇచ్చేది ఒక కృష్ణ మిల్క్ యూనియన్ అనేది వివరించారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రైతులకు నూటికి పది రూపాయల చొప్పున ధర వ్యత్యాసం జిల్లా యూనియన్ రైతులకు అందజేస్తుందని వివరించారు. యూనియన్ వారు రాయితీపై సరఫరా చేస్తున్న మినరల్ మిక్చర్, డీ వార్మింగ్ మందులు, గేదెల ఇన్సూరెన్స్, మనుషుల ఇన్సూరెన్స్ అందరూ వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

ప్రజాశక్తి - చింతలపూడి

గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. 20వ శతాబ్దంలో కొన్ని సిద్ధాంతాలు, రచనలను ప్రతిపాదించాడని, 21వ శతాబ్దంలో ఇప్పటికీ సంబంధితంగా ఉన్నాయని ప్రభుత్వం డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్‌జెకె.నరేంద్ర కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ డి.దేవానందం మాట్లాడుతూ ఉద్దండులే పరిష్కరించలేని గణిత సమస్యలను తన అపార మేధా సంపత్తితో చిటికెలోనే పరిష్కరించి, వారి నుంచి ప్రశంసలందుకున్నారన్నారు. అందుకే ఆయన పుట్టిన రోజును జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. చివరగా చరిత్ర అధ్యాపకులు డాక్టర్ ఎ.సంతోష్ మాట్లాడుతూ చరిత్రకి, గణిత శాస్త్రానికి అవినావ భావ సంబంధం ఎక్కువగా ఉందని విద్యార్థులకు వివరించి, వందన సమర్పణతో ముగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : నేటి విద్యార్థులకు లెక్కల మాంత్రికుడు రామానుజన్ ఆదర్శప్రాయుడని అరసం రాష్ట్ర కార్యదర్శి బిఎన్.సాగర్ అన్నారు. ఆదివారం రామానుజన్ పుట్టినరోజు, గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక శ్రీసాయి సూర్య హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. రామానుజన్ పుట్టినరోజు సంవత్సరం ఆకారంలో విద్యార్థులు కూర్చోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాగర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు సుమారు 50కుపైగా మాథ్స్ ప్రాజెక్ట్ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కంచర్ల పవన్ కుమార్, పాఠశాల సిబ్బంది, లాబ్ టెక్నీషియన్ రాజేష్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : శ్రీనివాస రామానుజన్ జన్మదినం పురస్కరించుకొని నూజివీడు శ్రీశారదా జూనియర్ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు కళాశాల ఛైర్మన్ కుప్పాల శంకరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గణిత శాస్త్ర గొప్పతనాన్ని, నిత్య జీవితంలో గణిత శాస్త్ర పాత్రను తెలియజేస్తూ, కళాశాల గణిత అధ్యాపక బృందాన్ని ఘనంగా సన్మానించారు. సీనియర్ గణిత అధ్యాపకులు ముత్యాల వేణుగోపాల్ రచించిన రెండు పుస్తకాలను విద్యాసంస్థల ఛైర్మన్ కుప్పాల శంకర్రావు, కరెస్పాండెంట్ రాధిక, ప్రిన్సిపల్ నాగబాబు, అప్పాజీ ఆవిష్కరించారు.